# ఎంగిలిచేత్తో

నాతకాని దుబ్బమ్మ కాళ్లనిండా దుబ్బ... ముఖం నిండా దుబ్బ... నెరసినవెంట్రుకల నిండా దుబ్బ... చేతుల్నిండా దుబ్బ...

చేటెడు చెరిగి శుభ్రం చేస్తే పిడికెడు వడ్లు కూడా రావడంలేదు.

మాసికలేసి కట్టుకున్న చీర నిండా దుబ్బుంది. చిరుగులు పడ్డ జాకెట్టూ దుబ్బమయమై వుంది. తల వెంట్రుకల్నుంచికాలి గోరు వరకు ఆమె శరీరమంతా దుబ్బే... దుబ్బమ్మ పేరుకు తగ్గట్టు దుమ్మే ఆకారమన్నట్టుగా వుంది.

ఆమె కళ్ళు డొక్క లోపలికి పోయున్నాయి. కాళ్ళు కట్టెపుల్లల్లా వున్నాయి. చీపురు పుల్లల్లా వున్న చేతుల్లో చీపురు, చేటున్నాయి. ఆమె నడుముకో పాత గుడ్డుంది. తలకు తుండుగుడ్డుంది.

పట్ట పగలు మధ్యాహ్నపు టెండ మాడందిగా వుంది. చెట్టు కొమ్మ కూడ ఊగడం లేదు. ముఖంపై నుండి కారుతున్న చెమటను కొంగుతో తుడుచుకుంటూ ఊరి బయటున్నకల్లాల దగ్గరి కొచ్చింది దుబ్బమ్మ. అప్పుడే కల్లం లేపుకొని వడ్లు తీసుకెళ్ళిన రాంరెడ్డి పటేలు కల్లంలో నిల్చుంది. చేట క్రింద పెట్టింది. చేతిలో ఉన్న చీపురుతో కల్లం ఊడ్వడం మొదలెట్టింది. ఎండమండిపోతోంది. కల్లం ఊడుస్తుంటే లేస్తున్న దుమ్ము నోట్లోకి, ముక్కులోకి పోతోంది. కల్లమంతా ఊడ్చి దుమ్ము, ధూళితో పాటు నామమాత్రంగా వచ్చిన వరి ధాన్యాన్ని కుప్పజేసింది.

కల్లం చుట్టుప్రక్కలకున్న మట్టిని, దుమ్మును ఊడ్చుకొచ్చి కల్లంలో కుప్పబోసింది. ఇప్పుడామె శరీరం మరింత దుబ్బమయమై దుమ్ముకే ప్రతి రూపంలా ఉంది. దుమ్ము నోట్లోకెళ్ళి ఊపిరాడక దగ్గొచ్చింది దుబ్బమ్మకు, కళ్‌కళ్‌మని దగ్గింది. ఉమ్మితోపాటు నల్లగా బయటకొచ్చినదుమ్మును తుపుక్కున ఉమ్మేసింది. ముక్కులోంచి కారుతున్న చీమిడిని గట్టిగా చీది పారేసింది. చీమిడితో పాటు నల్లగా దుమ్ము బయటకొచ్చింది. కుప్పగా పోసున్న దుమ్మును చేతిలోకి తీసుకుంది. పరీక్షగా చూసింది. వైరాగ్యంగా నవ్వుకుంది.

కల్లం దగ్గరకు పోతున్న కాపు రాజమ్మ అక్కడాగింది. ''గాదుబ్బల వడ్లెల్లుతయని కుప్ప జేసినావే..?'' అంది.

'' ఏం జెయ్యాలె పటేలవ్వ? నా పనే గిదాయె' అంది దుబ్బమ్మ.

''గీపన్జేసి బతుకుతావ్?'' వ్యంగ్యంగా అంది రాజమ్మ.

''చిన్నప్పట్నుంచి గీ పన్జేసుకుంటేనే బతుకు తున్నగాదు పటేలవ్వ! నాకు వేరే ఏం పనస్తది సెప్పు?''

''నిజమే కని గిప్పుడు కల్లాలల్ల వా...ల్లిడ్సి పెడ్తంద్రు? ఆ దుబ్బంత పోతం జేత్తె నీకు చారెడిత్తులు

దొరుకుతెక్కో'' అని వెళ్ళిపోతోంది రాజమ్మ.

''అవు రాజవ్వ! మరి గిట్లెందుకైతందో తెలుత్తలేదు'' అని దుమ్మును చేటలోకి తీసుకుంది. దుబ్బమ్మ.

కొంచెం కొంచెంగా కొమ్మలూగడం చూసి గాలి వస్తుందని తూర్పారబట్టడం మొదలెట్టింది.

రాళ్ళు, వడ్లగింజలు కుప్పగా పడుతుంటే దుమ్ము, గడ్డి, చెత్తంతా గాలికి కొట్టుకు పోతోంది. కొద్ది సేపట్లో కుప్పంతా తూర్పారబట్టడం అయిపోయింది.

రాశిగా మిలిగిన రాళ్ళను, వడ్లను చేటలోకి తీసుకొని అందులోంచి వడ్లను వేరు చేయడానికి చెరగడం మొదలు పెట్టింది దుబ్బమ్మ. పెద్ద పెద్ద రాళ్ళ నేరేస్తోంది. మట్టి బెడ్డలను తీసిపారేస్తోంది. చేటెడు చెరిగి శుభ్రం చేస్తే అందులోంచి పిడికెడు వడ్లు కూడా రావడం లేదు. నడుముకు కట్టుకొనున్నబట్ట విప్పి కల్లంలో పరిచి చెరుగగా వచ్చిన వడ్లను అందులో పోస్తోంది.

రాశిని చెరుగుతనే వుంది దుబ్బమ్మ.

'నిన్న దినమంత ఎండంలో తిరిగి మూడు నాలుగు కల్లాలూడుత్తె మానెడిత్తులన్న రాలే... ఇయ్యాల్లే పాటత్తయో?'' తనలో తాను గొణుక్కుంటూ పని చేస్తోంది.

'కల్లం పూర్తిగా ఊడ్చుక పోతం్రడు. కల్లం అంచులకు గూడ వడ్లిత్తులు పడనిత్తలేరు. ఇగ నా అసొంట్లోకేం దొరుకుతయి?' గొణుక్కుంటూ పని చేస్తోంది.

'మనుషులు గిట్లెందుకై పోతం్రడు? కల్లంల పిడికెడన్ని అడ్లుంచుతేం బాయె. పురాగ అన్నాలాని కచ్చింది' చేతిలో కొచ్చిన బెడ్డను తీసిపారేస్తూ అనుకుంది.

'మునుపు ఒక్క కల్లం ఊడ్చుకుంటే కుంచె డడ్లు దొరికేటియి. ఇప్పుడు మూడు నాలుగు కల్లాలూడ్సినామానెడు (1/4 కుంచం) కంటెక్కో దొరుకుతలెవ్వు'.

'ఇయ్యాల్ల మరీ గోరంగుంది. కల్లమంత ఊడ్తె దుబ్బంత చెరుగుతె సోలెడన్న ఎల్లెటట్లు లేవు'.

చేటలో మిగిలిన పిడికెడు వడ్లను గుడ్డలో పోస్తూ అనుకుంది దుబ్బమ్మ.

'నీయవ్వ ఊడ్సి, ఊడ్సి, చెరిగి, చెరిగి నారెక్కలు గుంజుతున్నాయి. ఏదో శాస్త్రం జెప్పినట్టు గట్టుక్కట్టెలు మోసినట్టే ఐతందినా పని'.

'లొట పెట పెదవులకు వక్కసపడ్డట్టు గీ దుబ్బల వడ్లెల్లుతయి? అంత మూతుల్నాకెటోల్లు తయారైం్రడు'

మట్టి చేతుల్తో తీసుకుంటూ అనుకుంది గొణుక్కుంటూ చెరుగుతోంది.

''బ్రహ్మంగారు మునుపే చెప్పిండు. ఎంపలి పెట్లకు నిచ్చెన్లేసెటోల్లు పుడుదరని... అయినె సెప్పిన యన్ని నిజమే ఐ తున్నయి'.

చెరగడం పూర్తి చేస్తూ అనుకుంది దుబ్బమ్మ...

గుడ్డ పేలికలో వున్న వడ్లలోకి చేయి పెట్టింది.

'అంతగౌడితే సోలెడు గావు. కల్లంల ముత్తెమన్ని వడ్లిడ్సి పెడితేంది? గింత దరిద్రమా?' గొణుక్కుంటూ ఓ గుడ్డన ముల్లెగట్టింది. తను చెరిగిన మట్టి, రాళ్ళ దిక్కు చూసింది.

తన శరీరం దిక్కు చూసుకుంది.

గుడ్డ, చీపురు, చేట చేతిలోకి తీసుకొని నిల్చుంది.

మరో కల్లంలోకి పోవాలనుకుంటుంది.

పొద్దొంగుతుంది. ఎండ తీవ్రత కొద్దిగా తగ్గింది. చుట్టు ప్రక్కల కల్లాల్లో ఎడ్లతో బంతులు కట్టి నడిపిస్తున్నారు. 'బాగ దూపైతంది. నీళ్ళుదాగాలె అనుకొని దగ్గర్లో ఉన్న ఒర్రె దిక్కు నడుస్తుంది దుబ్బమ్మ. ఒర్రె చేరుకోగానే గుడ్డ, చీపురు, చేట ఒడ్డుపై పెట్టి ఒర్రెలోకి దిగింది. చెలిమలో ఊరుతున్న నీళ్ళను దోసిలితో తీసుకొని తాగుతుంది. ఐదారు దోసిళ్ళ నీళ్ళు తాగింది.

'తియ్యగున్నయి నీళ్ళు, అమృతం లెక్కున్నయి. ఎండ కాలంల ఏం లేకున్నా సల్లటి నీళ్ళు దొరుకాలె' అనుకుంది.

మరో రెండు దోసిళ్ళ నీళ్ళు తాగి లేచినిల్చుంది.

'ఒర్రెను, ఈ చెలిమెనునా చిన్నప్పటి కెల్లి చూత్తున్న. ఇండ్ల నీల్లు పచ్చి పాలోలుంటయి' అనుకుంటూ పైకొచ్చింది.

చీపురు, గుడ్డ, చేట చేతుల్లో పట్టుకొని కల్లాల దగ్గరికొచ్చింది.

''ఏమాయెనే దుబ్బి? ఏ పాటి దొరికనయడ్లు?'' కల్లంలో వడ్లరాశి దగ్గర కూర్చొనున్న కాపు పోషాలడుగగానే నిల్చుంది.

''దుబ్బ దొరికినయి. రాశికి రాశి మన్ను చెరుగుతె ఇగో గీ అడ్లు దొరికినయి'' వడ్లను చూపెడుతూ అంది దుబ్బమ్మ.

''ఎంత జేసినా ఏట్లెకే పోయినట్టుగానట్టె. మాకు బాగ పంటలు పండుతున్నయని కల్లంల ఏడ్సిపెడ్తామె?'' అన్నాడు పోసాలు.

''ఏం పండుతలెవ్వా? మునుపటి కంటె తక్కో పంటత్తందా? అయినా మిమ్ములనెవ్వలిడ్సి పెట్టుమంటండ్రు పటేల? అయింత నాలుగిత్తులు గూడ గాలంబట్టి ఏరుకపొండ్రి. లేకుంటె కల్లాలను సిమెంటు జేయించుండ్రి. ఒక్కిత్తు గూడపోదు'' అంటూ అక్కన్నుంచి వెళ్ళిపోయింది దుబ్బమ్మ.

కొన్ని కల్లాల్లో బంతులుకొడుతున్నారు. కొందరు అలుగం మెన్ను పొడుస్తున్నారు. రెండు మూడు రోట్ల తూర్పారబడుతున్నారు.

''వచ్చినవా దొర్సాని. రా... రా... కల్లం లేవక ముందే చీపురు పట్టుకొనచ్చినవా?'' అంది రత్తమ్మ దుబ్బమ్మను చూసి.

''ఏంది పటేలవ్వ? మొకమంతెట్లనో పెట్టివేంది?'' అంది దుబ్బమ్మ.

''కల్లలంకే చీపురు పట్టుకోనత్తివి. మాకూడ్సినట్టుగాదా?

''బరుకతుంటాదె మాకు?'' అంది రత్తమ్మ.

''మేమత్తె బరుకతుండదట? మీరు కల్లంల అప్పుకండెడన్ని వడ్లిడ్సిపెడ్తండ్రుగదా! మాకేం బరుకతుంది మరి?'' కల్లంలో కూర్చొని అంది దుబ్బమ్మ.

''మాకేం మిగుల్తున్నయే మరి? రెక్కలు ముక్కలు సేసుకుంట బొర్లుతున్నమా? ఇంటింటి రాజులమంత దుబ్బల దుబ్బిపజ్జత్తున్నమా? నీకు తెలువదా ఏవుసాల సంగతి? మాకు కైకిలన్న పడుతున్నాదె?'' అంది రత్తమ్మ.

''అవు పటేలవ్వ. అంత పాడు కాలాని కచ్చింది. పంటలు పండుతలెవ్వంటనా పటేలవ్వ మరి? పండినా, పండకున్నా మనుషులు గోరంగ తయారైతండ్రు. మంచిగ పంట పండుతె మాత్రం కల్లంల

సొరెడిత్తులిడ్సి పెడ్తంద్రా? పండినాగంతే.. పండకున్నాగంతే. మనుషులకు పైసల మీన భమ ఎక్కో ఐతంది. ఒకల్నొగలు సూడకుంటై తంద్రు'' అంది దుబ్బమ్మ.

''నువ్వన్నది నిజమేనే దుబ్బి! రోజు రోజుకు కట్టెకోత కాలమత్తంది. ఒగల్నొగలు తినేకాలమత్తుంది'' అంది రత్తమ్మ.

''మునుపు అంత మంచిగనే ఉందని చెప్పుత లేనుగని రత్తవ్వ''. ఊరోల్లంత ఒగలనొగలు పట్టించుకునెటోల్లు. ఒగలకాపతత్తె ఇంకొగలు సాయపడెటోల్లు.. దొరలు గిట్ట సాగిచ్చుకున్నా... ఊరోల్లంత ఒక్క కుటుంబమోలె ఉండెటోల్లు... గిప్పుడు ఒగల నొగలుకానుతంద్రా? ఒగల బిసాయిదొగల కుందా? గవ్వేదో షేర్లట అచ్చినంక ఊళ్ళె పైసే పుడుతలేపాయె'' అంది దుబ్బమ్మ.

''నువ్వన్నది నువ్వద్దేనేదుబ్బి'' అంది రత్తమ్మ.

''కాదు పటేలవ్వ! మునుపు నేను బాగ తిన్ననని అంట లేనుగని నా పని తోని పొట్టకైతె సావులేకుండె, ఏ కల్లం నూకినా కుం...శన్ని వడ్లు దొరికేటియి. ఎవ్వలింటికి సుట్టమచ్చినా బంగారమోలె అరుసుకునెటోల్లు. కాపుదనపొల్లింటికి మా అసొంటోల్లు పోతె వట్టి చేతుల్తోని పంపియ్యకపోదురు. పని పాటలోల్లకు కుండలగల దింత పెట్టెటోల్లు. అడుక్కునెటోల్లకు లేదనకుంట శక్తికొద్దిచ్చెటోల్లు. పండుగలప్పుడు ఇంటింటికి ఎంత మంది తిరిగేటోల్లు? ఉన్నోల్లు గాని, లేనోల్లు గాని ఎవ్వలన్న కసురుకునేటోల్లా? అన్నము, అప్పాలే సెటోల్లు. ఉన్నదాంట్ల దింత పని పాటలోల్లకు తప్పకుండ దానం చేసేటోల్లు. శారతికాల్లు, మిత్తిరయ్యోర్లు, మందెచ్చులోల్లు. చిందుబాగోతలులు, కాటిపాపలోల్లు, గిట్ల ఎంతోమంది ఊరుమీద బతికెటోల్లు, గిప్పుడు గాల్లందర్నెవ్వలన్న కాస్తంద్రా పటేలవ్వ?'' అంది దుబ్బమ్మ.

''ఏందే దుబ్బమ్మ దొర్సాని ఏమో బాగ చెప్పుతున్నవేంది? బుదురకిచ్చిపటేలవ్వ దగ్గర వడ్లు దొబ్బిపోదామని సూత్తన్నవా?'' కల్లంలో బండి విడుస్తూ అన్నాడు వెంకట్రెడ్డి.

''అబ్బో! పటేలవ్వ గంటెడ్డిదేం గాదులే పటేల! పటేలవ్వ సొరెడిత్తులు పెడ్తనన్నా మీరు పెట్టనిచ్చెటట్టున్నారా? పని పాటలోల్లకు గూడ పెట్టకుంట బేంకులేసుకోంద్రి, బాగసంపాయించు చుంద్రి'. అంటూ లేచి నిల్చుంది దుబ్బమ్మ.

''మా ధ్గగరేడియే పైసలు? బేంకులు మాకేమెరుక? అప్పులుగాకుంటెసాలు'' అన్నాడు వెంకట్రెడ్డి.

''మీ గురించి కాదు పటేల? కని అందరు సంపాదనకెగనడ్డరు. మునుపు ఏ తోట్లకు పెయినా కూరగాయలిచ్చెటోల్లు గిప్పుడవ్వి అమ్ముకుంటంద్రు''.

''ఎప్పటి కాలమప్పుడు తియ్యి. మరి కైకిలోల్లు మునుపు ఎన్ని గంటలైన పనిజెయ్యకపోదురా? మరిప్పుడు టైములుప్పాత్తలేరా? నాలుగైదు గంటలకంటెక్కో పన్జేత్తంద్రా?'' అన్నాడు వెంకట్రెడ్డి అవునంది దుబ్బమ్మ.

''కొన్ని నీళ్ళు పొయ్యి పటేలవ్వ'' అంది.

చెట్టు నీడకున్న ఇత్తడి చెంబులున్న నీళ్ళను దుబ్బమ్మ చేతిలోకి వంచింది రత్నమ్మ.

''పొయ్యత్త పటేల, పోత పటేలవ్వ'' నీళ్ళు తాగడం పూర్తి చేసి అంది దుబ్బమ్మ.

''పొద్దు పోతంది పో. ఇంకో కల్ల మూడ్చుకుంటె తవ్వెడన్ని వడ్లు దొరుకతయి. రాజీరు షావుకారి కల్లం లేచింది పో'' అన్నాడు వెంకట్రెడ్డి.

'' ఇక గా కల్లంలేం దొరుకుతయి పటేల? కాపుదనపోల్ల కల్లాల్లనే గిన్ని వడ్లు దొరికినయంటె

షావుకారి కల్లం లేం దొరుకుతది చెప్పు?''

రాత్రయ్యే వరకు మరో రెండు కల్లాలూడ్చి, తూర్పారబట్టి చెరిగింది.

''పొద్దంత దుబ్బుల స్నానమాడి పజ్జెత్తె దొరికిన వడ్లు గివ్విమూడుసోల్ల మీద పిరికెడున్నేతయే మొ?'' తనలో తానుకుంది దుబ్బమ్మ.

'' ఇంటికి పొయ్యి పెయ్యి కడుక్కోవాలె. చల్లగుంది'' ఊరి దిక్కు నడుస్తూ తనలో తానుకుంటోంది దుబ్బమ్మ.

ఆలోచిస్తూ ఊళ్ళోకి నడుస్తున్న దుబ్బమ్మకు ఊళ్ళో ఏవో మార్పులొస్తున్నట్టు తోస్తోంది. కల్లాల్లో మునుపటిలా ధాన్యముంచకపోవడానికికారణం పంట పండడమో, పండకపోవడమో కాదని పిస్తుందామెకు. అందుక్కారణం మరేదో ఉందనిపిస్తుందామెకు. మనుషుల స్వభావాల్లోనే మార్పు వస్తున్నట్టు తోస్తుందామెకు. మనిషి డబ్బుకిస్తున్న విలువ మరి దేనికీ ఇవ్వడం లేదనిపిస్తోంది. ఊళ్ళోకి ఏదో ప్రవేశిస్తున్నట్లుని పిస్తుందామెకు.

బాగా ఆలోచిస్తూ నడుస్తున్న దుబ్బమ్మకు 'ఎంగిలి చేత్తో కాకిని కొట్టని తనం' ఊళ్ళోకి ప్రవేశిస్తున్నట్లు తోస్తోంది.

''అవు. నిజమే. ఎంగిలి సెయ్యితోనిగూడ కాకిని కొట్టనోల్లు రోజురోజు కెక్కో ఐతండ్రూల్లే తనలో తాను గొణుకు న్నట్లనుకుంటూ భారంగా అడుగులేస్తూ తన గుడిసె చేరుకుంది దుబ్బమ్మ.

*మయూరి సచిత్ర వారపత్రిక 12-2-94*